క్లుప్తంగా

నల్లా పైపు పగిలి నీటి వృథా



నర్సంపేట : పట్టణంలోని జయలక్ష్మి సెంటర్ లోని లీల ఆస్పత్రి పక్కన మెయిన్ రోడ్డుపై పైపు పగిలి మూడ్రోజులుగా నీరు వృథా పోతోంది. దీంతో రోడ్డు బురదమయమై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ తనిఖీ



వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ అంబటి నర్సయ్య శనివారం సందర్శించి తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది కిట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బాధితుల నుంచి అందే ఫిర్యాదులను సమగ్రంగా విచారించాలని చెప్పారు. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సైలు చందర్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



రాయపర్తి : మండలంలోని దరియాతండాకు చెందిన తేజావత్ అనితకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకుడు తేజావత్ సంతోష్‌నాయక్ శనివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనిత అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోగా సీఎం సహాయ నిధి నుంచి సాయం మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తేజావత్ బాష్‌సింగ్, తేజావత్ సోమన్న, దేవేందర్, తేజావత్ రాజేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి



నిఖిల్ (ఫైల్)

చెన్నారావుపేట: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. కోనాపురం గ్రామానికి చెందిన ఈదుల నర్సయ్య కుమారుడు నిఖిల్ (19) నర్సంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కొద్దిరోజులుగా కడుపునొప్పి, జాండీస్‌తో బాధపడుతున్నాడు. దీంతో ఈ నెల 22న రాత్రి ఎలుకల మందును కూల్ డ్రింక్‌లో కలిపి తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం ఊరచెరువు శివారులో గుర్తుతెలియని వ్యక్తి తుమ్మ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు. శనివారం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 40–45 సంవత్సరాలు ఉంటుందని, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహం ఉందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఇల్లంద శివారులో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. నల్లబెల్లికి చెందిన ముత్యం అనిల్ బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన ఆయన్ను స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని హౌజుబుజుర్గులో హుస్సేన్ బీ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రేవూరి రణధీర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మార్క సుమలత రజనీకర్, మిరియాల కుమార్, శ్రవణ్, కమలాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి గుంతలమయం

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



పర్వతగిరి-చింతనెక్కొండ బీటీ రోడ్డుపై గుంతలు

పర్వతగిరి : మండలంలోని పర్వతగిరి సబ్‌స్టేషన్ నుంచి చింతనెక్కొండ వరకున్న బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. రైతులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మళ్లీ బీటీ రోడ్డు వేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. 2017లో నాటి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా టీఆర్‌ఆర్ నిధుల నుంచి రూ.225 లక్షలు మంజూరు చేయగా సబ్‌స్టేషన్ నుంచి చింతనెక్కొండ వరకు బీటీ రోడ్డు వేశారు. ప్రస్తుతం ఆ బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. దీంతో చింతనెక్కొండ నుంచి పర్వతగిరికి వచ్చే చింతనెక్కొండ శివారు గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పాదచారులు, వాహనదారుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు చింతనెక్కొండ, సాయిరెడ్డిపల్లి మీదుగా పర్వతగిరికి ఏడు కిలోమీటర్లు అదనంగా తిరిగి రావాల్సిన దుస్థితి నెలకొంది. సబ్‌స్టేషన్ నుంచి చింతనెక్కొండ వరకు బీటీ రోడ్డు వేయని పక్షంలో ఆందోళనలు తప్పవని రైతులు, ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

తక్షణమే బీటీ రోడ్డు వేయాలి



చింతనెక్కొండ నుంచి పర్వతగిరికి వెళ్లాలంటే రోడ్డు బాగాలేక ఇబ్బందులు పడుతున్నాం. పర్వతగిరికి ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న చింతనెక్కొండ రోడ్డు పాడై పోవడంతో సాయిరెడ్డిపల్లి మీదుగా వెళ్లాలంటే 12 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ప్రభుత్వం తక్షణమే బీటీ రోడ్డు వేయాలి.

\- గటిక మహేశ్, రైతు, చింతనెక్కొండ

ఎమ్మెల్యే చొరవ చూపాలి



వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చొరవ చూపాలి. చింతనెక్కొండ-పర్వతగిరి బీటీ రోడ్డు వేసే దిశగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి. రైతులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చింతనెక్కొండ–పర్వతగిరి రోడ్డు బాగు చేసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలి.

\- కుడికాల శ్రీధర్, ఆర్‌ఎంపీ, చింతనెక్కొండ

‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. మండలంలోని కాల్‌నాయక్ తండాకు చెందిన యువమోర్చా జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు గుగులోతు నరేశ్, బానోత్ రవి, బానోత్ రమేశ్ శనివారం బీజేపీలో చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు మెజార్టీ స్థానాలను కై వసం చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, ఉపాధ్యక్షులు కొంకీస విఘ్నేశ్ గౌడ్, గూడూరు సందీప్, అబ్బరబోయిన రాజు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



నర్సంపేట : పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో బాబు, తదితరులు

నర్సంపేట : పట్టణంలోని మినీ స్టేడియంలో ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేట కబడ్డీ అసోసియేషన్ జోన్ సెక్రటరీ గాదెపాక బాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇంటర్ జోనల్ ఖానాపురం, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. జనవరి 5న సంగెం మండల కేంద్రంలో జరగనున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ఖానాపురం మండల అధ్యక్షుడు ఇర్ప వీరస్వామి, నెక్కొండ మండల ప్రధాన కార్యదర్శి మొగిలి పవన్ కల్యాణ్, స్టేడియం ఇన్‌చార్జ్, కోచ్ యాట రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకన్న, లావణ్య, రాణాప్రతాప్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

రవిచంద్ర హైస్కూల్ విద్యార్థులు..



సంగెం : పోటీలకు ఎంపికైన చరణ్, విఘ్నేశ్

సంగెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కబడ్డీ బాలుర విభాగం మండలస్థాయి స్కూల్ లెవల్ పోటీల్లో స్థానిక రవిచంద్ర హైస్కూల్ విద్యార్థులు జె.చరణ్, సిహెచ్.విఘ్నేశ్ ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం కాసం క్రాంతికుమార్, రవిచంద్ర స్కూల్ కరస్పాండెంట్ కాసం చంద్రారెడ్డి అభినందించి మాట్లాడారు. విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందించడమే ధ్యేయం



ఆలయ పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

- ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : మండల ప్రజలకు సేవలు అందించడమే ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ధ్యేయమని ఆ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మైలారంలో పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను శనివారం ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు, గ్రామస్తుల కోరిక మేరకు పురాతన పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి ఖర్చు భరించడానికి తాను ముందుకొచ్చినట్టు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో సీసీ కెమెరాల ప్రారంభం

మండలంలోని సన్నూరు వెంకటేశ్వరపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు గ్రామంలో తన సొంత డబ్బుతో ఏర్పాటు చేసిన 7 సీసీ కెమెరాలను శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల ఆలయం సమీపంలో గుప్తనిధుల తవ్వకాలు జరిపిన నేపథ్యంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ సమస్యను వివరించడంతో తాను స్పందించి సీసీ కెమెరాల ఏర్పాటుకు తోడ్పాటు అందించినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి టోర్నమెంట్..

బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి సారథ్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్, నాయకులు ఆకుల సురేందర్‌రావు, పూస మధు, సురేందర్‌నాయక్, లమంచ శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, మధూకర్‌రెడ్డి, లేతాకుల సుధాకర్‌రెడ్డి, బిల్లా వెంకట్‌రెడ్డి, పరుపాటి రవీందర్‌రెడ్డి, సంది దేవేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, ఐరెడ్డి వెంకన్న, ఉల్లెంగుల యాదగిరి, ఉల్లెంగుల నర్సయ్య, ఐరెడ్డి ఎల్లారెడ్డి, బీరం వెంకట్‌రెడ్డి, గబ్బెట బాబు, ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షుడు బోయిని కుమార్, బోయిని కొమురయ్య, ఈర్ల మల్లయ్య, బోయిని చిన్నకుమార్, బాద సారయ్య, బాద రవి,నయీం, మహేందర్‌రెడ్డి, గూబ యాకమ్మ, పొన్నం కుమారస్వామి, గారె నర్సయ్య, పోగులకొండ అశోక్, ఎల్లస్వామి, గూబ అశోక్, గౌస్, సామ్రాట్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి బోనాల పండుగ



గీసుకొండ : మండలంలోని శాయంపేట హవేలీలో శనివారం రాత్రి పెద్దమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ముదిరాజ్, యాదవ కులాల ప్రజలు బోనాలతో తరలివెళ్లి ఆలయం వద్ద మొక్కులు చెల్లించారు. నూతన ఆలయాన్ని తన డబ్బుతో నిర్మించిన బొమ్మెర మనోహర్‌ను రెండు కులాల ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు జూల రమేశ్, నీరటి కుమారస్వామి, మాజీ ఎంపీపీ ముంత కళావతి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల చొరవ.. గొయ్యి పూడ్చివేత



సంగెం : ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని.. ఎదురు చూసి మోసపోకుమా.. అన్న సినీ గేయాన్ని రైతులు ఆచరించారు. ‘ప్రమాదకరంగా ఎస్సారెస్పీ బ్రిడ్జి’ శీర్షికతో ప్రధాన కాల్వకు పొంచి ఉన్న ప్రమాదం, పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులపై ‘సాక్షి’లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించకపోవడంతో కాట్రపల్లికి చెందిన రైతులు చొరవ తీసుకున్నారు. మొరం పోసి గొయ్యిని పూడ్చి కాలినడకన రాకపోకలు సాగించేలా తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్నారు. అధికారులు స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్లు

- మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రమాబాయి



మాట్లాడుతున్న రమాబాయి

చెన్నారావుపేట : కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తారని మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి, ఎల్లాయగూడెం మాజీ ఎంపీటీసీ భూక్య రమాబాయి రాథోడ్ స్పష్టం చేశారు. మండలంలోని చెరువుకొమ్ము తండాలో పంచాయతీ కార్యదర్శి బోడ అవినాశ్, సర్వే అధికారి రవి ఆధ్వర్యంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. అర్హులందరికీ తప్పకుండా అవకాశం లభిస్తుందని తెలిపారు. గతంలో కూడా కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు భూక్య మైబూసింగ్ రాథోడ్, కొర్ర మోహన్, మాజీ వార్డు సభ్యులు రవి, బాలు, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి



పర్వతగిరి : దేశ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు అన్నారు. పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు కూసం రాంచందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నాయకులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయక్, అనిల్‌రావు మాట్లాడారు. మన్మోహన్‌సింగ్ అమలు చేసిన ఆర్థిక, రాజకీయ సంస్కరణలు దేశాభివృద్ధికి బాటలు వేశాయని చెప్పారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సువార్త, మాజీ ఎంపీటీసీ మహేంద్ర, మాజీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

భూమిలేని కార్మికులకు భృతి చెల్లించాలి

- వ్యకాస జిల్లా కార్యదర్శి సమ్మయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సమ్మయ్య

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు భూమి లేని వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.12 వేల చొప్పున భృతి చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా పేద వ్యవసాయ కార్మికులకు భృతి చెల్లించడం లేదన్నారు. అర్హులను గ్రామసభల ద్వారా గుర్తించాలని చెప్పారు. భూమి లేని పేదలకు ఉపాధి హామీలో పని దినాలను కొలమానంగా తీసుకుని భృతి ఇవ్వాలని నిర్ణయించడం సరికాదన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోరబోయిన కుమారస్వామి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో భూమి లేని పేదలు అర్ధాకలితో అలమటిస్తూ కుటుంబ అవసరాల కోసం వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించే దుస్థితి నెలకొంటోందని ఆందోళన వెలిబుచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు రుద్రారపు లక్ష్మి, బస్కే మొగిలి, పెండ్యాల సారయ్య, బాబు, రైతు సంఘం నాయకులు అన్వర్, మాంకాల శ్రీనివాస్, వంగల వనాచారి, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పదవుల్లో యువతకు ప్రాధాన్యం

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : కాంగ్రెస్ పార్టీ పదవుల నియామకంలో యువతకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. యువత రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. యువతను పార్టీ ప్రోత్సహిస్తుందని చెప్పారు. అనంతరం పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా ముద్రబోయిన శ్రీకాంత్‌ను నియమిస్తూ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడారు. అన్ని రంగాల్లో యువత కీలక పాత్ర పోషించేలా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కుసుమ చెన్నకేశవులు, అన్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న తిరుపతిరెడ్డి, నాయకులు

నల్లబెల్లి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి కేక్ కట్ చేసి శ్రేణులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ అర్హులకు సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రజా సమస్యలు పరిష్కరించేలా అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మాలోత్ రమేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేశ్, నాయకులు మాలోత్ మోహన్, మాలోత్ చరణ్‌సింగ్, బత్తిని మహేశ్, అజ్మీర తిరుపతి, జంగిలి మోహన్, పాగుల కుమారస్వామి, వైనాల పవన్, ప్రతాప్‌సింగ్, తిప్పని లింగమూర్తి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చెన్నారావుపేట : సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులతో చర్చలు జరపాలని వారి సమస్యలను పరిష్కరించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండల అధ్యక్షుడు అంగోతు భద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. డీఈఓ, ఎంఆర్‌సీ కార్యాలయాలు బోసిపోతున్నాయని తెలిపారు. కేజీబీవీల్లో బోధన కుంటుపడుతోందని ఆందోళన వెలిబుచ్చారు. వెంటనే సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింపజేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఆ ఫెడరేషన్ మండల ప్రధాన కార్యదర్శి యాకయ్య, నాయకులు ఉమాశంకర్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి అభిషేకం

ఐనవోలు : స్థానిక మల్లికార్జునస్వామి ఆలయంలో బహుళ త్రయోదశిని పురస్కరించుకుని శనివారం ప్రదోష వేల నందీశ్వరుడికి అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో రుద్రేశ్వరుడికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంకాలం సూర్యాస్తమయం తర్వాత ప్రదోషకాలంలో మల్లికార్జున స్వామి గర్భాలయానికి ఎదుట ప్రతిష్టితమైన నందీశ్వరుడిని పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకించారు. నందీశ్వరుడికి వస్త్రధారణ చేసి ధూపం వేసి గంధం బొట్టుపెట్టి అలంకరించారు. వేదోక్తంగా పూజించి పండ్లు ఫలాలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం నందీశ్వరుడికి, గర్భాలయంలో రుద్రేశ్వరుడికి నక్షత్ర హారతి ఇచ్చారు. ఆర్జిత సేవా టికెట్ కలిగిన భక్తులకు స్వామి వారి శేషవస్త్రాలతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు, ముఖ్య అర్చకుడు మధుకర్ శర్మ, వేదపండితులు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్‌జోషి, అర్చకుడు భానుప్రసాద్‌శర్మ, సాయిరామ్ శర్మ, పాతర్లపాటి నరేష్‌శర్మ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్‌తో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



నర్సంపేట రూరల్ : నర్సింగ్ విద్యాభ్యాసంతో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లిలోని బాలాజీ నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నర్సింగ్ లక్ష్యం, ఔన్నత్యం, ఉపాధి అవకాశాలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ డాక్టర్ వనజారెడ్డి, సెక్రటరీ రాజేశ్వర్‌రావు, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ఏఓ సురేశ్, కళాశాల ప్రిన్సిపాల్ భానురేఖ తదితరులు పాల్గొన్నారు.